

# కథ కాని కథ

పి. చంద్రశేఖర ఆజాద్

'మా పత్రికకు ఓ మంచి సరదా కథ రాయవచ్చుగా,' అంటుంది రమ. రమ ఓ పత్రికకు సంపాదకురాలు. నేను సరదా కథలు రాయలేను. ఒకటి రెండుసార్లు ప్రయత్నం చేసి విఫలం అయ్యాను. ఎంత సరదాగా కథ రాయాలన్నా అందులో ఏదో ఒక సామాజిక అంశం ఉంటుంది.

రమ రచయిత్రి కూడా. కొన్ని కథలు రాశారు. హృద్యంగా ఉంటాయి. సాధారణ జీవితం నుంచి బయటకు వచ్చి, ఏ సముద్రతీరంలోనో పుస్తకాలతో కూర్చుని, సముద్రం కేసి చూస్తూ, ఆ ఘోష వింటూ చదివితే బాగుంటాయనిపిస్తాయి. వాళ్ల పాఠకులు వేరు. సీరియస్ కథలు ఆ పత్రికలో రావని కాదు. అలాంటి కథలు రాసేవారు 'ఫలానా' పత్రికలో కథ వస్తే సీరియస్ పాఠకుల దృష్టికి వస్తుందనుకుని ఆ పత్రికలకే పంపిస్తుంటారు.

"జీవితంలో ఎప్పుడూ సీరియస్‌గా ఉండలేం. మంచి సినిమా చూసినా, మంచి సంగీతం విన్నా మనకు ఆనందం కలుగుతుంది. అలాగే ఎంత సామాజిక సమస్యల మీద రాసే రచయితలైనా సరదా కబుర్లు చెప్పుకుంటారు. వారికీ అన్నిరకాల మనుషుల్తో సంబంధాలు ఉంటాయి. మనం సాహిత్యంలో అన్ని రసాలకూ ప్రాధాన్యం ఇవ్వాలి. జీవితమంటే అదే కదా," అంటుంది రమ.

అప్పుడప్పుడూ రమ తనకు నచ్చిన సీరియస్ కథలూ ప్రచురిస్తుంది. తనకు నచ్చకపోయినా, ఆ కథల్లోని విషయాలతో ఏకీభవించకపోయినా ఓ పట్టాన రాజీపడదు. ఆ కథల మీద వాదిస్తుంది. సీరియస్ పత్రికల వారికే స్ట్రాంగ్ కన్విక్షన్స్ ఉంటాయనుకోవటం పొరపాటు. ఆ మాటకొస్తే ఏ పత్రిక పాలసీనైనా నిర్ణయించేది ఆ పత్రికల యాజమాన్యాలు. వారు అంగీకరించిన మేరకే, అంగీకరించినంత కాలమే ఏ ధోరణికి చెందిన కథలైనా వస్తాయి. సంపాదకులుగా ఉండే వ్యక్తుల కులమూ, మతమూ, ప్రాంతమూ కొంతవరకూ ఆయా కాలాల రచనల్ని ప్రభావితం చేయగలవు.

నిజానికి ఒకప్పుడు నేను విస్తృతంగా కథలు రాసే వాడ్ని. ఈమధ్య ఇంకో ప్రక్రియలోకి మారాను. రచయితల సమస్యల్లో ఇదీ ఒకటి. పదే పదే రాస్తుంటే మనకే మొనాటనీ అనిపిస్తుంది. ఒకే విషయాన్ని అటూ, ఇటూ చేసి చెబుతున్నామా అనుకుంటాం. కొత్త ప్రక్రియలోకి మారినప్పుడు కొంతకాలం హాయిగా ఉంటుంది.

"అందుకే మహాశయా లైటర్ టోన్‌లో ఒక కథ రాయండి," అని రమ ఎప్పట్నుంచో అడుగుతోంది. ప్రయత్నం చేస్తానంటూ చెబుతూ వస్తున్నాను.

నాకో డాక్టర్‌గారు తెలుసు. అంతకుముందు ఆయన ఉద్యమాల్లో పనిచేశారు. సాహిత్యం బాగా చదువుతారు. ఎక్కువగా వ్యాసాలు రాస్తుంటారు. మా రచనల మీద ఆయన సునిశిత విశ్లేషణ చేస్తుంటారు.

కథకుల్లో ఓ రకమైన ఆవేశం ఉంటుంది. ముఖ్యంగా సీరియస్ కథా రచయితల్లో, రచయిత్రుల్లో కూడా. అందులోనూ ఏదో ఒక ధోరణి తీవ్రంగా ఉండే రోజుల్లో అనేకమంది ఈ ఆవేశాలకు లోనవుతారు. అందువల్ల కథావస్తువు దెబ్బతింటుంది. వారి సిద్ధాంతం లేదా నినాదాలు ముందుకొస్తాయి. ఆ తర్వాతెప్పుడో రచయితలకు జ్ఞానోదయం అవుతుంది. ఈలోగా జరగాల్సిన చెడు జరిగిపోతుంది.

నన్ను కొంతమేరకు అలాంటి ఆవేశాలకు లోను కాకుండా మా డాక్టర్‌గారు కాపాడారు. అందుకే నేనా యన్ని గురువుగా భావిస్తుంటాను. ఆయనకి ఈ మధ్య కథలు రాయాలన్న కోర్కె కలిగింది. ఇంతకుముందే చెప్పాను, మనిషి ఎప్పుడూ ఒకే తరహా జీవితాన్ని కోరుకోడు.

ఆయన దగ్గరకు అనేకమంది రోగులు వస్తుం టారు. అందులో అన్ని కులాల వారుంటారు. వర్గాల వారుంటారు. వారందరినీ దగ్గరగా పరిశీలించవచ్చు. ముఖ్యంగా పేదరికం, కులం, మతం తెచ్చే అనేకానేక సమస్యల వల్ల ఆసుపత్రుల చుట్టూ తిరిగే వ్యక్తులు ఎందరో ఉంటారు. అన్నిటికి మించి కుటుంబం పెద్ద నేపథ్యం. రోగాల కేంద్రం కూడా. ఈ అనుభవాల్ని వ్యాస రూపంలో కాకుండా కథలుగా రాస్తే బాగుంటుంది. ఆ విషయమే డాక్టర్‌గారితో చెప్పాను.

ఆయన తనకు తెలిసిన ఓ స్త్రీ గురించి చెప్పారు. "ఈ కథ రాయాలనుకుంటున్నాను," అన్నారాయన.

"తప్పకుండా రాయండి. నాకు తెలిసిన మంచి చిత్రకారుడు ఉన్నాడు. అతన్తో అద్భుతమైన చిత్రం గీయించి ఏదొక పత్రికకు ఇస్తానని," చెప్పాను. నేను హైదరాబాద్‌లో ఉంటాను. డాక్టర్‌గారు విజయవాడలో ఉంటారు.

ఆయన కథ రాసి పంపించారు. వెంటనే ఆయనకు ఫోన్ చేసి 'బాగుంది' అని అభినందనలు తెలియజేశాను.

"మీరు ఇక నుంచి క్రమం తప్పకుండా కథలు రాస్తుండండి," అని కూడా చెప్పాను.

నేనయితే ఆ కథను ఇంకా బాగా రాయగలను అనిపించింది. 'బాగా' రాయటం అంటే ఏమిటి అనే ప్రశ్న వెంటనే తలెత్తింది.

ఒకప్పుడు నేను కథలు రాసేటప్పుడు 'బాగా' రాయటం గురించి ఆలోచించేవాడ్ని కాదు. నన్ను కది లించే వ్యక్తులుగానీ, సంఘటనలు గానీ తటస్థపడితే ఓ ఉద్వేగంతో కథ రాసేవాడ్ని. అది చదివిన సాధారణ పాఠకులు అభినందించేవారు. కొంత పేరు వచ్చాక అసలు సమస్య మొదలయింది.

కథానిర్మాణ సూత్రాలు కొన్ని ఉన్నాయని తెలుసుకోవడం మొదలయింది. నేపథ్యం- కథనం- కాలం- శిల్పం- ప్రారంభం- ముగింపు వీటి మధ్యలో అనేకానేక అంశాలు. వీటన్నిట్నీ నైపుణ్యంతో నిర్వ హించగలిగితేనే ఉత్తమ కథ అవుతుంది లేదా 'గొప్ప' కథ అవుతుందనే విషయం తెలుసుకుంటున్న కొద్దీ నేను కథలు రాయటం తగ్గిపోయింది.

నేను క్రమంగా సాధారణ పాఠకులకు దూరం అయ్యాను. మేధావులైన కొందరు విమర్శకులకు మాత్రమే దగ్గరయ్యాను. ఇంకొంతమంది చేత 'బాగా రాశావ్' అనిపించుకోవాలనే తాపత్రయం ఎక్కువ యింది. అలాంటివారు ఓ పట్టాన నన్ను ఆమోదించరని తెలుసు. అయినా ఇప్పుడు నన్ను సంఘటన కంటే, వస్తువు కంటే శిల్పచాతుర్యమే కట్టి పడేస్తోంది. ఓ లౌల్యం నన్ను కమ్మేసింది.

ఇప్పుడు నేను కథ రాయాలంటే అందులో కవిత్వం జోడించాలా- ఆకర్షణీయమైన వాక్యాలు రాయాలా- మేధావి వర్గాన్ని ఎలా ఆకర్షించాలి? వార్తల్లో ఎలా ఉండాలి? ఇదే నా తపన! నాలో సహజమైనదేదో కోల్పోయానని నాకే అర్థం అయింది.

అందుకే మరో ప్రక్రియలోకి ప్రవేశించటం, మళ్లీ అక్కడ ఓ అజ్ఞానం, ఓ ఉద్వేగంతో ఆరంభం కావచ్చు కదా! డాక్టర్‌గారు రాసిన కథలో గొప్ప కవిత్వంలేదు. శిల్పం లేదు. సరళంగా, సూటిగా, నిరాడంబరంగా వుంది. ఆ కథ పేరు 'రాములమ్మ.' వెంటనే ఆ కథను నా మిత్రుడైన చిత్రకారుడికి ఇచ్చాను.

"ఈ కథ నాకు నచ్చింది. మీకు నచ్చితే మంచి బొమ్మ వేయండి. మంచి పత్రికలో వస్తే సాహితీ ప్రియులు చదువుతారు. పదిమందితో చర్చిస్తారు," అన్నాను శంకర్‌తో.

శంకర్ కొన్ని దశాబ్దాలుగా బొమ్మలు గీస్తున్నాడు. ఎప్పుడూ చేతినిండా పని. తరగని పని. అతనికీ అదే సమస్య.

"ఈమధ్య బొమ్మలు గీయాలనిపించటం లేదు. నన్ను కదిలించే రచనలు తక్కువ వస్తున్నాయి," అంటాడు శంకర్.

అతను ఆలస్యంగా బొమ్మలు గీస్తాడు. అందుకు ఇష్టపడే వారే ఆయన దగ్గరకు వెళ్తారు. ఒక్కోసారి శంకర్ వల్ల పుస్తకాలు ఆలస్యంగా వెలుగులోకి వస్తాయి. అతను స్పందించి గీసిన ప్రతి చిత్రమూ అద్భుత కళాఖండమే!

'రాములమ్మ' కథ చదివాక మేం కలుసుకున్నాం.

"కథ బాగుందోయ్. నువ్వు తొందరపెట్టకపోతే ఆ కథకు మంచి చిత్రం గీస్తాను. రాములమ్మ బొమ్మ గీయాలంటే నేను ట్రాన్స్‌లోకి వెళ్లాలి," అన్నాడు శంకర్.

నేను కాదనలేకపోయాను.

ఇంతకు ముందు కథ సహజంగా, సూటిగా, నిరాడంబరంగా వస్తే చాలన్నాను. ఇప్పుడు మంచి బొమ్మ కావాలంటున్నాను. ఇందులోని వైరుధ్యం మీకు అర్థమయ్యే ఉంటుంది.

కథ రాయటం ఎంత గొప్ప విషయమో ఆ కథను ప్రెజెంట్ చేసే తీరూ అంత గొప్ప విషయమే. మంచి కథలు గొప్ప బొమ్మలు లేనంత మాత్రాన గొప్ప కథలు కాకుండా పోవు. ఆ మాటకొస్తే పుస్తకరూపంలో వచ్చే కథలకు అందరూ బొమ్మలు గీయించరు.

కానీ ఓ పత్రికలో కథ చదువుతున్నప్పుడు ఆ కథకు అద్భుతమైన బొమ్మ తోడైతే పాఠకుడి భావనా ప్రపంచంలో సరికొత్త ఊహలు ఆవిష్కారం కావచ్చు. అంతకుమించి రచనలు చేసేవారికి ఇదీ బలమే. బల హీనతే. ఒకప్పుడు తమ పుస్తకం బయటకు వస్తే చాల నుకునేవారు. ఇప్పుడు అందంగా రావాలనుకుంటు న్నారు. అందుకోసం అప్పులు చేయటానికైనా సిద్ధపడ తారు. సౌందర్యాన్ని విమర్శించేవారూ ఇందుకు అతీతం కాదు. ఇప్పుడు రచన లక్ష్యం పోటీలో ఉన్నామా లేదా అనేది కూడా!

రెండు నెలలు గడిచిపోయాయి.

శంకర్ బొమ్మ వేయనేలేదు. అతని ఆరోగ్యం కూడా అంత బాగుండటం లేదు. దానికితోడు అతనో యూనివర్సిటీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజువారీ కార్యక్రమాలు ఎటూ ఉంటాయి.

డాక్టర్‌గారు అప్పుడప్పుడు ఫోన్ చేసి ఆ కథ ఏం చేశావ్ అని అడుగుతున్నారు. కథలు రాయకపోవటం వేరే విషయం. ఓసారి కథంటూ రాశాక అచ్చులో చూసు కోవాలని ఎవరికైనా ఉంటుంది.

"బొమ్మ వేస్తున్నాడు డాక్టర్‌గారూ," అని చెబు తున్నాను.

శంకర్‌ని గట్టిగా అడగలేను. అయినా అప్పు డప్పుడు గుర్తుచేస్తున్నాను.

"రాములమ్మని చిత్రించటం అంత తేలిక కాదు. నాక్కొంచెం టైం ఇవ్వు," అంటున్నాడు. సాహితీమిత్రు లకు ఈలోగా ఆ కథ గురించి చెప్పాను. వాళ్లూ ఆనం దించారు. ఆ కథను ఓసారి చదవాలనుంది అంటు న్నారు. నేను 'రమ' గారికి ఈ విషయం చెప్పలేదు. నాకు తెలిసిన ఓ సాహితీపత్రిక ఉంది. ఈ కథ వారికివ్వా లనుకుంటున్నాను.

'రమ' పనిచేస్తున్న పత్రికలో స్టాఫ్ ఆర్టిస్టు లున్నారు. వారే కథలకు బొమ్మలు గీస్తారు. అవి బాగుండవని కాదు. వారి పద్ధతి వేరు. శంకర్ మనసు పెట్టి బొమ్మ గీస్తే ఆ కథకు వచ్చే అందం వేరు!

ఇంకో నెల గడిచిపోయింది.

డాక్టర్‌గారు మర్యాదస్తులు కాబట్టి అప్పుడప్పుడు ఫోన్ చేస్తున్నా కథ గురించి అడగటం మానుకున్నారు. నిజానికి ఆయన మిత్రుడో పత్రిక చూస్తున్నారు. అతనికే ఆ కథ పంపాలనుకున్నారు. నేను ఆ కథ విన్నాక అత్యుత్సాహం చూపించాను. శంకర్ విషయం ముందే తెలుసు. అందుకే వత్తిడి చేయలేదు.

చివరికి అడిగేశాను.

"ఇప్పటికి నాలుగు నెలలయింది. 'రాములమ్మ' కథకి బొమ్మ గీయరా?" అని.

"రెండు మూడుసార్లు ప్రయత్నం చేశాను. నాకు సంతృప్తి కలగలేదు. చించేశాను," అన్నాడు.

"డాక్టర్‌గారు అడుగుతున్నారు. పోనీ రమగారికి ఆ కథ ఇస్తాను" అన్నాను మొహమాటంగా.

"ఆ పని చెయ్యి," అన్నాడు శంకర్.

"మీరేమీ అనుకోరుగా," అన్నాను.

"ఇప్పటికే ఆలస్యమైంది. డాక్టర్‌గారిని ఏమీ అనుకోవద్దని చెప్పు," అన్నాడు శంకర్.

"మీకో మంచి కథ ఇస్తున్నాను. పరిశీలించండి," అని రమగారికి పంపించాను. రెండు రోజుల తర్వాత ఫోన్ చేశాను.

"కథ చదివారా?" అని అడిగాను.

"చదివాను. రాయటంలో పరిణతి కనిపించ లేదు," అందామె.

"మీరు ఆ కథలో శిల్పం కోసం చూడొద్దు. కథ ఎలా ఉందో చెప్పండి," అన్నాను.

"అంతా బాగుందిగాని ఆ కథలో ఓ వాక్యం నాకు నచ్చలేదు," అంది రమ.

నేనూ, డాక్టర్‌గారూ, శంకర్ బాగుందనుకున్న వాక్యం అది. ఆ వాక్యం గురించి చెప్పే ముందు 'రాములమ్మ' కథ గురించి క్లుప్తంగా చెప్పాలి.

రాములమ్మ నోరుగల ఆడది. ఆమెకో మగపిల్ల వాడు. వాడు పుట్టాక రాములమ్మ మొగుడు ఆమెతో తగాదాపడి వెళ్లిపోయి ఇంకో పెళ్లి చేసుకున్నాడు. రాములమ్మ ఆ గ్రామంలో ఏ సమస్య వచ్చినా తనే ముందుంటుంది. చిన్నచిన్న జ్వరాలకూ, ఇంకేమైనా శారీరక బాధలు కలిగినప్పుడు, పిల్లవాడికి ఆరోగ్యం బాగుండకపోయినా డాక్టర్‌గారి దగ్గర వైద్యం తీసుకుం టుంది. ఆశలు వదిలేసుకున్న తన కొడుకును డాక్టర్

గారు బతికించారు. అప్పట్నుంచి, 'నువ్వు దేవుడి వయ్యా' అంటుంది రెండు చేతులూ జోడించి.

'నేనూ నీలాంటి మనిషినే,' అంటాడాయన. డాక్టర్‌గారంటే రాములమ్మకు ఎనలేని గౌరవం, భక్తి.

పిల్లవాడు పెద్దవాడయి, పట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు. అప్పుడు రాములమ్మని విడిచి వెళ్లిన మొగుడు కొడుకు దగ్గరకొచ్చాడు. అతని రెండో పెళ్లాం చచ్చిపోయింది. అతను కొడుకు దగ్గరకెళ్లి భోరున ఏడ్చాడు.

"మీ అమ్మ నోటి దురుసువల్లే నేను నీకు దూరం అయ్యాను. ఇప్పుడు నా ఆస్తికి వారసుడివి నువ్వే మనిద్దరం కలిసుందాం," అన్నాడు.

ఆ కుర్రాడు అమ్మ దగ్గరకొచ్చాడు. జరిగిన విషయం చెప్పాడు. నిలువు గుడ్లేసుకుని చూస్తా వుంది రాములమ్మ.

"నువ్వు నీ అయ్యని 'ఛీ' ఎందుకు కొట్టలేదురా," అని అడగాలనుకునే లోపు ఆ మాటలు వినిపించాయి.

"నేను నాన్న దగ్గరికి వెళ్లిపోతున్నా."

తనేం వింటుందో అర్థంకాలేదు. అదే మాట మళ్లీ చెప్పాడు.

"మరి నేనెట్టా బతకాలి కొడకా," అంది గొంతు వణుకుతుండగా.

"నీకేంటమ్మా. నోరుంది. నీ నోరెట్టుకుని ఎట్ట యినా బతగ్గలవు. నాన్న నోరు లేనోడు," అనేసి కొడుకు వెళ్లిపోయాడు.

అప్పుడు రాములమ్మకు గుండెలో నొప్పి అనిపిం చింది. డాక్టర్ దగ్గరికి వచ్చింది. ఆమెనలా చూడగానే, "ఏమయింది రాములమ్మా ఎందుకలా ఉన్నావు?" అనడిగారాయన.

పర్వతంలా గంభీరంగా ఉండే రాములమ్మ చేజారిన నీటికుండయింది. సముద్రం లాంటి రాము లమ్మ మున్సిపాలిటీ పంపులో నీరయింది. అప్పుడు ఒక్కొక్క మాటా కూడదీసుకుని మాట్లాడింది.

"అయ్యా... నా కొడుకు తెలుసుగా. నువ్వాడిని చావు బతుకుల గీతకు ఇవతల పడేసినావు. ఇన్నేళ్లూ పేనంగా పెంచుకున్న కొడుకు నా గుండెల మీద గుద్దేసి అయ్యతో ఎల్లిపోయినాడు. నువ్వు లేకుండా ఎట్టా బతకన్రో బిడ్డా అన్నా. నీకేంటమ్మా ఎట్టయినా బతుకు తావన్నాడు. ఆడూ మగాడేనయ్యా. సత్తెపెమానకంగా చెబుతున్నా. ఇప్పటిదాకా ఆడి కోసమే బతికా. ఆడ్ని చూసుకుంటా బతికా. ఇన్నేళ్లల్లో ఎప్పుడన్నా ఒకటి రెండుసార్లు కాలు జారానేమోగాని ఆడికోసం బతకని నిముసం లేదు. నేనింకెవరికోసం బతకాల్నయ్యా," అని బావురుమంది.

డాక్టర్‌గారు ఏమీ చెప్పలేని ఓ మహా మౌనంలోకి జారిపోయారు. అప్పుడే ఎవరో వచ్చారు. "రాములమ్మా నువ్విక్కడున్నావా? ఎమ్మార్వోగారొచ్చారు. బ్యాంకులా ల్లొచ్చారు. సామాన్లు బయటపడేస్తారంట. జప్తు చేస్తా రంట," అంటుంటే తనని తాను సంబాళించుకుని,

"అట్టెట్టా చేత్తారు. నేనొస్తన్నా పదండి," అని చెప్పి,

"అయ్యా గుండెనొప్పికి రెండు గోళీలివ్వు. ఇప్పటి దాకా ఎవరికోసం బతకాలన్నాను. ఇదిగో ఇలాంటి మనుషుల కోసం బతకాలి," అని కొంగుతో కన్నీళ్లు తుడుచుకు వెళ్లిపోయింది. ఇదీ కథ.

"ఎప్పుడన్నా ఒకటి రెండుసార్లు కాలు జారానేమో గాని అన్న వాక్యం తీసేసి కథ ప్రచురిస్తున్నాం. డిటిపి చేస్తున్నారు," అంది రమ.

"అయ్యయ్యో ఆ కథకు ప్రాణం అయిన వాక్యం అదే. రాములమ్మ వ్యక్తిత్వాన్ని ఆకాశమంత పెంచిన వాక్యం అది. ఆ వాక్యం తీసేస్తే ఆ కతలో 'సోల్' ఉండదు," అన్నాను.

"లేదు. ఆ వాక్యం వల్ల రాములమ్మ వ్యక్తిత్వానికి మచ్చ వస్తుంది. అందుకే ఎడిట్ చేశాను," అన్నారామె.

"ఇందులో మచ్చ వచ్చేదేముంది. అది రచయిత కల్పించిన వాక్యంకాదు. ఆమె హృదయం నుంచి వచ్చిన మాటల్ని యథాతథంగా రాశారాయన. దీనివల్ల రాములమ్మ నిజాయితీ వెల్లడవటం లేదా?" అన్నాను.

రమ అంగీకరించలేదు.

"నిజం అయినంత మాత్రాన మనం అన్ని విషయాలూ చెప్పగలమా? చెప్పవచ్చా?" అందామె.

"అదలా ఉంచండి. ఆమెను భర్త విడిచిపెట్టాడు. ఇంకో పెళ్లి చేసుకున్నాడు. అన్ని సుఖాలూ అనుభవిం చాడు. ఇన్నేళ్ల జీవితంలో ఒకటి రెండుసార్లు శారీరక బాధ తీర్చుకున్నంతలోనే ఆమెకు మచ్చ కలుగు తుందా? ఆమె కృషంతా గాల్లో కలిసిపోవాల్సిందేనా?"

"ఒకటి రెండుసార్లు మాత్రం ఎందుకు అలా చేయాలి? పవిత్రంగా ఉండొచ్చు. అలా ఉన్నవారు లేరా?"

"మీరు స్త్రీగా ఆలోచిస్తున్నారా?"

"కానే కాదు. ఆ వెధవని తీసేయండి. మగవాడు కూడా అలాగే ఉండాలని నేను కోరుకుంటాను."

''మీ పత్రిక పాలసీకి ఈ కథ భిన్నంగా ఉందంటే నేను ఒప్పుకుంటాను. కథలో సజీవమైన అంశం అది. భౌతిక అవసరం. ఆ విషయాన్ని దాచిపెట్టటం వలన రాములమ్మ గొప్ప ఆదర్శపాత్రగా మిగలవచ్చు. కానీ తనూ రక్తమాంసాలున్న మనిషి,'' అన్నాను.

''ఇంత చిన్న విషయం మీద మీరెందుకు ఆర్గ్యూ చేస్తున్నారు. ఆ మాత్రం ఎడిటింగ్ కథలకి అవసరం. అర్థం చేసుకోండి. కథలో ఆ వాక్యం ఉండటానికి నేను అంగీకరించలేకపోతున్నాను,'' అంది రమ.

''సరే. అలాగే కానీయండి,'' అన్నానుగానీ, అది చిన్న విషయమా!

డాక్టర్‌గారు ఫోన్ చేసినప్పుడు ఈ విషయం చెప్పాను.

''రెండు నెలల్లో కథ వస్తుంది. కాకపోతే ఆ వాక్యం ఎడిట్ అయ్యింది.''

''అదేంటి?'' అని ఆయన ఆశ్చర్యపోయారు.

రమ భావాలు ఆయనకు వివరించాను. ఆయన కూడా ఆ వాక్యం తొలగించటాన్ని డైజెస్ట్ చేసుకోలేక పోయారు.

''వేమన, శ్రీశ్రీలాంటివారి వ్యక్తిగత జీవితంలో అరాచకత్వం ఉంది. రాములమ్మ విషయం అలా కాదు. అప్పటి భౌతిక పరిస్థితి, అదీ ఒకటి రెండుసార్లు. అంతమాత్రాన తన గ్రామ ప్రజలకోసం ఆమె చేసిన పోరాటాలకు విలువ లేదా? మగవాళ్లు ఎలా తిరిగినా ఫర్వాలేదా? ఎందుకలా ఆలోచిస్తున్నారామె,'' అన్నారాయన.

''మగవారు కూడా అంత పవిత్రంగా ఉండాలని వారి ఉద్దేశం.''

''ఉంటే మంచిదే. ఇవి వాస్తవాలు. మనం అర్థం చేసుకోవాలి,'' అన్నారాయన.

''డాక్టర్‌గారూ! ఇదే ఓ చర్చనీయాంశం. కథల్లో అన్ని విషయాలూ చెప్పాలా? వద్దా? మీరు ఇంకొన్ని కథలు రాయండి. మనం పుస్తకంగా తెచ్చుకునేటప్పుడు ఈ వాక్యం ఉంచుదాం,'' అన్నాను.

అది సంతృప్తికరమైన సమాధానం కాదని నాకు తెలుసు.

ఆయన మాట్లాడలేదు.

నేనా కథను తీసుకొని ఉండాల్సింది కాదేమోనని పించింది. ఆయనే ఏదో ఒక పత్రికకు పంపించుకునే వారు.

''మంచి పత్రికలో కథ వస్తుంది. ఎక్కువమంది చదువుతారు. ముఖ్యంగా ఇదిగో ఇలాంటి మనుషుల కోసం బతకాలి అనే వాక్యం కోసమైనా ఆ కథ అచ్చు కావాలి,'' అన్నాను.

''సరే కానీ,'' అన్నారు అసంతృప్తితోనే. ఉదయమే ఫోన్ మోగింది. డాక్టర్‌గారే చేశారు.

''ఆ వాక్యం ఇబ్బందికరంగా ఉందనుకుంటే ఓ పని చేద్దాం. నేనెప్పుడైనా తెలిసో తెలియకో ఓ తప్పుచేసి ఉండచ్చు అనిపిస్తే చాలు,'' అన్నారాయన.

''నేను మాట్లాడతాను,'' అన్నాను.

రమగారి కోసం ప్రయత్నం చేశాను. తను ఊరు వెళ్లారని చెప్పారు. రెండు రోజుల తర్వాత వచ్చారామె. డాక్టర్‌గారి సవరణ గురించి చెప్పాను.

''మీరందరూ ఎందుకంతగా ఆ వాక్యం గురించి ఆరాటపడుతున్నారు? మీకు ఆ వాక్యమే కావాలనుకుంటే ఆ కథ వెనక్కి తీసుకోండి. ఇంకో పత్రిక్కి ఇవ్వండి. ఐయామ్ సారీ,'' అంది గట్టిగానే.

నేను ఓ క్షణం మాట్లాడలేకపోయాను.

నా కథనయితే వెనక్కి తీసుకునేవాడినే. ఇన్ని నెలలుగా ఆ కథ కోసం డాక్టర్‌గారు ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు ఇంకో పత్రికంటే మళ్లీ ఎన్ని నెలలు పడుతుందో!

''మీ ఇష్టం రమగారూ! నా అభిప్రాయం చెప్పాను.''

''మీరు ఇప్పటికీ కన్విన్స్ కాలేదా?''

''ఆ కథ నాది కాదు. అయినా నా అభిప్రాయమే ఫైనల్ కాదు. నేనూ పొరపాటుగా అర్థం చేసుకునుండొచ్చు,'' అన్నాను.

ఆ రాత్రి మళ్లీ డాక్టర్‌గారి ఫోన్.

''సారీ డాక్టర్‌గారూ! ఎడిటర్ ఒప్పుకోలేదు. బహుశా పత్రిక పాలసీ అయి ఉంటుంది. బయటకు చెప్పలేకపోతున్నారేమో! కావాలంటే కథ వెనక్కి తీసుకొమ్మన్నారు.''

''తీసుకోకపోయావా?'' అన్నారాయన.

''నాకెందుకో ఆ కథ వెలుగు చూడాలనిపించింది. రాములమ్మలాంటి వారు అరుదుగా ఉంటారు. మన నాయకుల జీవితచరిత్రలో కూడా చీకటి కోణాలున్నాయి. ఉంటాయి. అలాంటి వాటిని ఎడిట్ చేసిన ప్రముఖుల గురించి నాకు తెలుసు. అందుకు కారణం వారు చేసిన త్యాగాలను వదిలేసి ఇటువంటి విషయాల మీద అనవసర చర్చలు చేస్తారనే అభిప్రాయం కావచ్చు,'' అన్నాను.

"ఇంక ఎక్కువగా ఆ విషయం మీద మాట్లాడను. చాలామంది ప్రజలు భక్తితో కొలిచే భగవంతుడికి కూడా ఇలాంటి బలహీనతలున్నాయి. సమాజానికి కావాల్సింది వ్యక్తుల కంట్రిబ్యూషన్. ఆ సంపదనే ప్రజలు స్వంతం చేసుకుంటారు. వ్యక్తుల బలహీనతల దెప్పుడూ రెండో స్థానమే. అది మేధావులకి తప్ప సామాన్యులకి పట్టదు," అన్నారాయన.

రెండు నెలలు మేం ఆ కథ గురించి మాట్లాడుకోలేదు. ఆరోజు నేనింకా నిద్రపోతుంటే ఫోన్ మోగుతున్న శబ్దం... "హలో," అన్నాను.

"ఇప్పుడే పత్రిక వచ్చింది. రాములమ్మ కథను ఆ వాక్యంతో సహా ప్రచురించారు," అంటున్నారు డాక్టర్ ఆనందంగా.

నా నిద్రమత్తు వదిలిపోయింది.

నేను వెంటనే రమకు ఫోన్ చేశాను.

"ఇప్పుడే డాక్టర్‌గారు ఫోన్ చేశారు. రాములమ్మ కథని ఆ వాక్యంతో సహా ప్రచురించారట కదా."

"అవును."

"అందుకు మిమ్మల్ని ప్రేరేపించిన లేదా కన్విన్స్ చేసిన సంఘటన ఏదన్నా జరిగిందా?" అన్నాను.

"సోవియట్ యూనియన్‌ని నిర్మించిన నాయకుడు లెనిన్ సిఫిలిస్ వ్యాధితో చనిపోయాడని ఇజ్రాయిల్ డాక్టర్లు ప్రకటించారు."

"ఈ వార్త వచ్చింది ఎక్కడ్నుంచి?" అన్నాను ఆవేశంగా.

"లండన్ నుంచి."

"అది దుష్ప్రచారం. మళ్లీ ప్రపంచాన్ని కమ్యూనిస్టు భూతం ఆవహించింది," అన్నాను.

"కమ్యూనిస్టులు భూతాల్ని నమ్మరు. నేను ఇలాంటి వార్తల్ని నమ్మను. జిడ్డు కృష్ణమూర్తిగారి శృంగార జీవితం మీద ఆరోపణలు రావటం కూడా ఈమధ్యనే నా దృష్టికి వచ్చింది. వీటి వెనుక రాజకీయాలు-ఆర్థిక ప్రయోజనాలు ఉండొచ్చు. ఆ కోణంతో ఆలోచిస్తున్నప్పుడు రాములమ్మ గొంతును నేనెందుకు సెన్సార్ చేయాలనిపించింది. తెలిసో, తెలియకో సాహిత్యంలో ఇంకెన్ని విషయాలు సెన్సారవుతున్నాయో అని కూడా అనుకున్నాను. అందుకే నా వంతు బాధ్యతగా ఆ వాక్యంతో సహా రాములమ్మ కథను ప్రచురించాను," అంది రమ.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 15 ఆగస్టు 2004*

